

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE


సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 61 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 12, మే 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# ఖాకీ “జులుం” కబ్జాకు “బలం”.*









డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్






- కేయూ భూమిని కబ్జా చేస్తున్న పోలీసు ఉన్నతాధికారి.
- పోలీస్ అధికారుల సంఘం స్పందించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.
- జిల్లా కలెక్టర్ సదరు కబ్జా భూమి, కేయూదేనని సర్వే నివేదిక ద్వారా నిర్ధారించారు.
- సాధారణ ప్రజలను చితక్కొట్టే అధికారులకు పోలీసు అధికారి కబ్జా ఎందుకు కనిపించడం లేదు.
- విద్యాశాఖ మంత్రి సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలి.
- భూ రక్షణ దారులపై పగబడుతూ కక్ష సాధింపు చర్యలకు ఎగబడుతున్నారు.
- కేయూ అధికారుల మొర పట్టించుకున్న నాథుడే లేడు.
- లెక్కలేనన్ని ఇంటెలిజెన్స్ నివేదికలు లెక్కలేకుండా పోతున్నాయి.
- విజిలెన్స్ అధికారుల జాయింట్ సర్వే నివేదిక ఎక్కడ.
- ఎస్బిఐ అధికారుల విచారణ నివేదికలు ఏమైనట్టు.
- టాస్క్ ఫోర్స్ అధికారులు సిద్ధపరచిన నివేదికలను సీపికి అందించారు.
- పలుమార్లు సర్వే కొలతలు కొలిచి నివేదికలిచ్చారు.
- జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్కు జిల్లా కలెక్టర్ సదర్ కబ్జా భూమి కేయూదేనని నివేదించారు.
- డాక్టర్ బరిగెల శివ.

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

ప్రభుత్వ భూములను కాపాడాల్సిన పోలీస్ అధికారి కేయూ భూమిని కబ్జా చేస్తున్న తీరు పోలీసు వ్యవస్థకు తీరని మచ్చలాగా మారిందని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా విమర్శించారు.సాధారణ ప్రజలు భూకబ్జాలకు పాల్పడితే తక్షణమే చర్యలు తీసుకునే పోలీస్ అధికారులు పోలీసు ఉన్నతాధికారి కేయూ భూమిని కుబ్జాకు పాల్పడుతున్నాడని కేయూ అధికారులు పదుల సంఖ్యలో ఆధారాలతో కూడిన లేఖల ద్వారా జిల్లా ఉన్నతాధికారులైన పోలీస్ రెవెన్యూ మున్సిపల్ అధికారులకు కబ్జా విషయాలను వివరిస్తూ చర్యలు చేపట్టాలని అనేకసార్లు కోరిన సందర్భాలు కలవని అయినప్పటికీ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోగా సదరు కబ్జా చేయబడుతున్న భూమికి పూర్తిగా సహకారం అందిస్తున్నట్లుగా చర్యలు చేపట్టకపోవడం కాకతీయ విశ్వవిద్యాలయ భూమిలో సదరు పోలీసు అధికారి రుబాబు కొనసాగిస్తున్నాడని కేయూ అధికారులు భయాందోళన చెందుతున్నారని గుర్తు చేశారు.వందలసార్లు కబ్జా వివరాల విషయమై పలు పత్రికలు వార్తలు రాస్తున్నప్పటికిని ఇటు పోలీసు అధికారులు కానీ అటు ప్రభుత్వ పెద్దలలో గాని ఏమాత్రం చలనం లేకపోవడం భూకబ్జాను పెంచి పోషిస్తున్నట్లుగా ఉందని విమర్శించారు.సాధారణ ప్రజలను చిత్రహింసలు పెట్టి విపరీతంగా

- మిగతా 2లో..

## భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు: అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

1998 పోక్రాన్ అణు పరీక్షలను గుర్తుచేస్తూ మోదీ కీలక వ్యాఖ్యలు

సోమనాథ్ ఆలయ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని

బుజ్జగింపు రాజకీయాలపై ప్రతిపక్షాలను విమర్శించిన మోదీ

సోమనాథ్ పునరుద్ధరణ భారత సాంస్కృతిక స్వేచ్ఛకు ప్రతీక అని వెల్లడి

భారత్‌ను తలవంచేలా చేసే శక్తి ప్రపంచంలో ఏదీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 1998లో పోక్రాన్‌లో జరిపిన అణు పరీక్షలను గుర్తుచేస్తూ, భారత సంకల్పం ఎంత దృఢమైనదో ప్రపంచానికి ఆనాడే తెలిసొచ్చిందని అన్నారు. సోమవారం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో జరిగిన ‘సోమనాథ్ అమృత్ మహోత్సవ్’ వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



2

## బంగారం కొనొద్దన్న మోదీ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ ఘాటు స్పందన

ప్రజలు త్యాగాలు చేయాలన్న ప్రధాని మోదీ విజ్ఞప్తి

ఏడాది పాటు బంగారం కొనొద్దని, ఇంటి నుంచే పనిచేయాలని సూచించిన మోదీ

ప్రతిసారీ బాధ్యతను ప్రజలపై నెట్టేస్తున్నారన్న రాహుల్



2

## తన డ్రెస్సుతోనూ ద్రవిడ సంప్రదాయాలను బ్రేక్ చేసిన విజయ్... ప్రమాణ స్వీకారం వేళ డార్క్ బ్లేజర్!

2

తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నటుడు విజయ్

## మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు

నెల రోజుల పాటు వాడవాడలా టీఆర్ఎస్ జెండా పండుగలు

రాజధాని నుంచి గ్రామస్థాయి వరకు జెండా పండుగ

పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జెండా పండుగ

2






## విద్యా విధానాన్ని అధ్యయనం చేయడానికి ఫిన్‌లాండ్ పంపించాం: రేవంత్ రెడ్డి

అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి ఉత్తమ విద్యావిధానాలను అమలు చేస్తామని హామీ

విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకు రాగలమన్న రేవంత్ రెడ్డి

అందుకే విద్యాశాఖను తాను నిర్వహిస్తున్నట్లు వెల్లడి

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

## భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు: అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

1998 మే 11న భారత శాస్త్రవేత్తలు పోక్రాన్‌లో అణు పరీక్షలు జరిపి దేశ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆ పరీక్షల తర్వాత ప్రపంచ దేశాలు మనపై అనేక ఆంక్షలు విధించి, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని చూశాయని అన్నారు. అయినప్పటికీ భారత్ వెనక్కి తగ్గలేదని, మే 13న మరోసారి పరీక్షలు జరిపి తన రాజకీయ సంకల్పాన్ని నిరూపించుకుందని వివరించారు. "మనం వేరే మట్టితో తయారైన వాళ్ళం" అంటూ ఆనాటి ధైర్యాన్ని కొనియాడారు.సోమనాథ్ ఆలయం గురించి మాట్లాడుతూ.. 75 ఏళ్ల క్రితం జరిగిన ఆలయ పునరుద్ధరణ కేవలం ఒక సాధారణ కార్యక్రమం కాదని, అది భారత సాంస్కృతిక స్వేచ్ఛా ప్రకటన అని మోదీ అభివర్ణించారు. చరిత్రలో ఎన్నోసార్లు ఆలయాన్ని ధ్వంసం చేసినా, ప్రతిసారీ పునర్నిర్మించామని, ఇది భారత విశ్వాసానికి ఉన్న బలమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత సోమనాథ్ ఆలయ నిర్మాణంలోనూ బుజ్జగింపు రాజకీయాలు జరిగాయని, సర్దార్ పటేల్ వంటి వారి ప్రయత్నాలను నెహ్రూ వ్యతిరేకించారని విమర్శించారు. ఇదే తరహా రాజకీయాలు అయోధ్య రామమందిర నిర్మాణం విషయంలోనూ కొనసాగాయని అన్నారు. పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆలయంలో విశేష మహా పూజ, కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హెలికాప్టర్ల ద్వారా ఆలయ గోపురంపై పూలవర్షం కురిపించారు.

## బంగారం కొనొద్దన్న మోదీ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ ఘాటు స్పందన

మొదటి పేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు త్యాగాలు చేయాలంటూ ప్రధాని చేసిన విజ్ఞప్తి 'వైఫల్యానికి నిదర్శనం' అని ఆయన అభివర్ణించారు.సోమవారం నాడు ఎక్స్ వేదికగా రాహుల్ స్పందిస్తూ.. "నిన్న మోదీజీ ప్రజలను త్యాగాలు చేయమని అడిగారు. బంగారం కొనొద్దు, విదేశాలకు వెళ్లొద్దు, పెట్రోల్ వాడకం తగ్గించండి అన్నారు. ఇవి ఉపన్యాసాలు కాదు.. వైఫల్యానికి రుజువులు" అని పేర్కొన్నారు. "12 ఏళ్లలో ఆయన దేశాన్ని ఇంతటి స్థితికి తీసుకొచ్చారు. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైకి నెట్టివేసి, తాము తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక 'కాంప్రమైజ్డ్ ప్రధాని' దేశాన్ని నడిపించడం ఇక సాధ్యం కాదు" అని రాహుల్ తీవ్రంగా విమర్శించారు.

ప్రధాని విజ్ఞప్తి ఇదే..

హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన బీజేపీ బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, పశ్చిమాసియా సంక్షోభం వల్ల దేశ విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఏడాది పాటు బంగారం కొనడం ఆపాలని, విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించి, మెట్రో, కార్ పూలింగ్ వంటివి ఉపయోగించాలని సూచించారు. అలాగే, వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుంచే పని) విధానాన్ని మళ్లీ పాటించాలని, వంట నూనెలు, ఎరువుల వాడకం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానైనా విదేశీ మారకాన్ని ఆదా చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

## విద్యా విధానాన్ని అధ్యయనం చేయడానికి ఫిన్‌లాండ్ పంపించాం: రేవంత్ రెడ్డి

విదేశాల్లో అమల్లో ఉన్న విద్యావిధానాలను అధ్యయనం చేయడానికి 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించామని, అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి ఉత్తమ విద్యావిధానాలను తెలంగాణలో అమలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన విద్యావారోత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతూ, విద్యావ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలిపారు.విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని, అందుకే విద్యాశాఖను తానే నిర్వహిస్తున్నానని అన్నారు. విద్యా వ్యవస్థలో తెలంగాణ దశాబ్దాలుగా వివక్షకు గురైందని అన్నారు. అందుకే 1969లో తెలంగాణ ఉద్యమం వచ్చిందని, నాటి నుంచి నాలుగున్నర దశాబ్దాలు పోరాడి తెలంగాణను సాధించుకున్నామని తెలిపారు. అందరికీ నాణ్యమైన విద్య అందించాలని అన్నారు.తమ ప్రభుత్వం రాగానే 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని, 60 రోజుల్లో పరీక్షలు నిర్వహించి నియమక పత్రాలు అందించినట్లు చెప్పారు. వివాదాలు లేకుండా 36 వేల మంది టీచర్లను బదిలీ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలు ఫలితాల్లో ఎందుకు వెనుకబడి ఉన్నాయో ఆలోచించాలని అన్నారు. విద్యాశాఖకు 15 శాతం నిధులు పెంచుతామని హామీ ఇచ్చారు. తెలంగాణలో ఉత్తమ విద్యావిధానాలను అమలు చేస్తామని అన్నారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకహారం పెట్టనున్నట్లు చెప్పారు. మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్ ఫాస్ట్ పథకం అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టామని అన్నారు. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని, కానీ మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నామని అన్నారు. టెన్ ప్లస్ టు విధానం లేకపోవడం వల్ల డ్రాపవుట్లు పెరుగుతున్నాయని వెల్లడించారు. కుల వివక్షను నిర్మూలించేందుకు తాము ఇంటిగ్రేటెడ్ స్కూళ్ళ నిర్మాణం చేపట్టామని ముఖ్యమంత్రి తెలిపారు.

## తన డ్రెస్సుతోనూ ద్రవిడ సంప్రదాయాలను బ్రేక్ చేసిన విజయ్... ప్రమాణ స్వీకారం వేళ డార్క్ బ్లేజర్!

నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, ముఖ్యమంత్రి విజయ్ తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆయన నిన్న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ధరించిన దుస్తులు, ఇచ్చిన సందేశం... ద్రవిడ రాజకీయాల ముగింపునకు, తరం మార్పునకు సంకేతంగా నిలుస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కారులో వచ్చినప్పుడు విజయ్ సాధారణ తెల్ల షర్టు, నల్ల ప్యాంటు ధరించి కనిపించారు. అయితే, వేదికపైకి వెళ్లే ముందు డార్క్ బ్లేజర్ ధరించారు. ఈ మార్పు ఆయనను ఒక సామాన్యుడి నుంచి బాధ్యతాయుతమైన రాజనీతిజ్ఞుడిగా మారడాన్ని సూచిస్తున్నట్లుంది. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, "నేను దేవుడి దూతను కాదు, మీలాంటి సాధారణ మానవుడిని. కానీ ప్రజలు నాతో నిలిస్తే ఏదైనా సాధించగలం" అని అన్నారు. "పేదరికం, ఆకలి నాకు తెలుసు. నేను రాజవంశంలో పుట్టలేదు. నేను మీలో ఒకడిని" అంటూ భావోద్వేగంగా ప్రసంగించారు.డీఎంకే, అన్నాడీఎంకే వంటి ద్రవిడ పార్టీల నాయకులు సాధారణంగా తెల్ల షర్టు, వేష్టీ (పంచె) ధరించడం సంప్రదాయం. ఎంజీఆర్ నుంచి కరుణానిధి, స్టాలిన్ వరకు ఇదే పద్ధతిని అనుసరించారు. అయితే, విజయ్ ఈ సంప్రదాయాన్ని పక్కనపెట్టి ప్యాంట్, బ్లేజర్‌తో కనిపించడం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది.

# ఖాకీ "జులుం" కబ్జాకు " "బలం"

మొదటి పేజీ తరువాయి

కొట్టే హక్కులు కలిగిన స్థానిక పోలీసులు సదరు కబ్జాపై లెక్కలేని సార్లు కేయూ అధికారులు పోలీస్ స్టేషన్ కు ఉత్తరాలు రాస్తున్నప్పటికిని కనీసం చర్యలు తీసుకోకపోగా దగ్గరుండి కబ్జాన్ని పెంచి పోషిస్తుండడం తీరని లోటుగా మిగిలిపోతుందన్నారు.గతంలో కేయూ భూముల కబ్జాలపై ప్రస్తుతం ఇంటెలిజెన్స్ రూరల్ విభాగంలో పనిచేస్తున్న ఏసీపీ దేవేందర్ రెడ్డి కఠినంగా వ్యవహరిస్తూ ఫోర్జరీ పత్రాలను సృష్టించుకున్న వ్యక్తులపై అప్పటి ఎస్పీ ఆదేశాల మేరకు పూర్తి సమగ్ర విచారణ చేపట్టిభూకబ్జాలకు పాల్పడుతున్న కబ్జాదారులపై భూకబ్జా రౌడీషీట్స్ నమోదు చేస్తూ కేయూ భూములను కాపాడి అనేక రకాల రాజకీయ ఒత్తిళ్లతో కూడిన మానసిక వేదనను,పలురకాల నిందలను అనుభవించారని తెలిపారు.అయినప్పటికీ కబ్జాల పరంపర ఆగకపోవడంతో అప్పటి జాయింట్ కలెక్టర్ వాగాటి కరుణ ఐఏఎస్ పలవెల్పుల శివారుకు చెందిన ప్రధాన కబ్జా భూములు సర్వేనెంబర్ 412 లో0.36 గుంటల భూమి,సర్వే నెంబర్ 413లో 3.07 ఎకరాల భూమి, సర్వే నెంబర్ 414 లో1.00 ఎకరం భూమిని 1968లో కాకతీయ యూనివర్సిటీ నిర్మాణం కొరకు ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలో పీజీ సెంటర్ కింద అక్వైర్ చేసుకుని1991 తర్వాత కాకతీయ విశ్వవిద్యాలయంగా పరిగణించబడుతూ అట్టి విస్తీర్ణంలోని భూములు కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందినవేనని సమగ్ర విచారణతో కూడిన సర్వే నివేదికలను సిద్ధపరచి 2011లో ప్రహరీ గోడలను నిర్మాణాలను కూల్చివేసిన సంగతిని గుర్తు చేశారు.అంతేకాకుండా కేయూ భూములని నివేదికలతో నిర్ధారించాక వార్నింగ్ బోర్డులతో పాటు ప్రభుత్వ దిమ్మెలను అట్టి స్థలాల్లో నిర్మించడం జరిగిందని ప్రస్తుతం కొంతమంది భూకబ్జాదారులు వాటిని పెరికివేసి ఇల్లు నిర్మించుకున్నారని వాటిపై ఇప్పటివరకు పోలీస్ అధికారులుకనీసం చర్యలు తీసుకోకపోవడం రాజకీయ నాయకుల ఒత్తిల్లు విపరీతంగా పెరిగిపోతున్నాయని భావించాల్సి ఉంటుండగా పలువెల్పుల భూములు కబ్జాలు చేసిన భూకబ్జాదారులకు 20 సంవత్సరాలుగా అన్ని పార్టీల రాజకీయ నాయకులు సహాయ సహకారాలు అందిస్తూ పోలీస్ అధికారులచే చర్యలు చేపట్టకుండా అడ్డుపడుతున్నారని అలాంటి సందర్భంలోనే ఏసీపి దేవేందర్ రెడ్డి తీసుకున్న చర్యలు రౌడీషీట్స్ నమోదు చేసిన తీరు కబ్జాలను కొంతమేర నియంత్రించగలిగిందని గుర్తు చేశారు.ఇదంతా గమనించిన భూకబ్జాదారులు 2013లో నేరుగా ఒక పోలీస్ అధికారిని ఒక ఆర్టీవో అధికారిని రంగంలోనికి దింపి మధ్యవర్తిత్వం చేసి 900 గజాల కాకతీయ విశ్వవిద్యాలయ భూమిని ఏసిపి జానీ నర్సింహులు సతీమణితోపాటు ఒక ఆర్టీవో అధికారి కంచె.వేణు పేర్ల మీద తర్జుమా చేయించి కేయూ అధికారులకు పోలీస్ అధికారి ఆర్టీవో అధికారికి మధ్య తగాదాలు సృష్టిస్తూ సదరు వ్యక్తులు కబ్జా చేసిన భూమినంతటిని కాపాడుకోవడం కోసం యూనివర్సిటీ అధికారులను భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా పోలీస్ అధికారులను అడ్డం పెట్టుకొని కేయూ భూములను కబ్జాలు నిర్వహిస్తున్న తీరు సంవత్సరాల కాలం పాటు సాగదీయబడుతూనే ఉందన్నారు.దానితోపాటు హన్మకొండ జిల్లా భూమి కొలతల కార్యాలయంలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన ఏడి ప్రభాకర్ తన కార్యాలయంలో పనిచేస్తున్న లేడీ రికార్డు అసిస్టెంట్ తో తప్పుడు మ్యాపులు సిద్ధపరిపించి రికార్డులను తారుమారు చేయడమే కాకుండా ఫోర్జరీ పత్రాలను సృష్టించి భూకబ్జాదారులకు సహకరించారని అట్టి ఆధారాలను గుర్తించిన ఏసీబీ దేవేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్ వాకాటి కరుణ అప్పటి ఎస్పీ ఆదేశాల మేరకు కఠినమైన చర్యలు తీసుకున్నారన్న సంగతిని నేటికీ మర్చిపోకూడదన్నారు.కేయూలో అధికారులు మారుతున్న ప్రతిసారి భూకబ్జాదారులు రాజకీయ పైరవీలు చేసుకుంటూ కబ్జా భూములను మరొక్కసారి కొలవండి అంటూ యూనివర్సిటీ అధికారులచే లేఖలు రాయించుకుంటూ కాలయాపన చేయిస్తుండడం వాటితో పాటు నేరుగా కబ్జాదారులే సర్వే చేయమని జిల్లా కలెక్టర్ కు ఎడీ ప్రభాకర్ కు వినతి పత్రాలు పెట్టుకుంటుండడం సర్వ సాధారణంగా మారిపోయిందని దానివల్ల పదుల సంఖ్యలో సర్వేలు నిర్వహించబడి కబ్జాలు చేయబడుతున్న భూములన్ని కేయూ భూములని సర్వే నివేదికలతో నిర్ధారించబడినప్పటికిని భూకబ్జాదారుల తీరు మారకపోవడంతో కబ్జాల పరంపర నిరంతరం కొనసాగుతూ దాడుల పరంపరను పోషించారని మొత్తం మీదుగా సదరు ఏసిపి పోలీస్ అధికారి సహకారంతో భూకబ్జాదారులు రెచ్చిపోతుండడం స్థానిక పోలీసులు క్షేత్రస్థాయిలో భూకబ్జాదారులకు సహకరిస్తుండడం కేయూ భూములకు రక్షణ లేకుండా పోయిందని తీవ్రంగా విమర్శించారు.

**కబ్జా వివరాలు**


కాకతీయ విశ్వవిద్యాలయ భూములు కబ్జాలు జరుగుతున్నాయని పలివెల్పుల శివారులో గల కేయూ భూములు అకారణంగా ఫోర్జరీ పత్రాలు సృష్టించబడి కబ్జాలు చేయబడుతున్నాయని గుర్తించిన కేయూ అధికారులు విద్యార్థులు చేస్తున్న ఉద్యమాలను గుర్తించి కొంతమేరకు కబ్జా భూములను కాపాడగలిగినారని తెలిపారు.అధికారం సహకరిస్తే అడ్డుపడేవాడు ఎవడు ఉన్నాడంటూ కబ్జాదారులు అక్రమ నిర్మాణాలను జోరుగా కట్టుకొని విశ్వవిద్యాలయానికి పోలీసు యంత్రాంగానికి మున్సిపల్ రెవెన్యూ యంత్రాంగాలకు ప్రభుత్వాలకు, పెసవాలు విసిరిన తీరు "నా"భూ కబ్జా భూతో "నా" భూకబ్జా భవిష్యత్తు లాగా మారిపోయిందన్నారు. సర్వేనెంబర్ 413లో గల భూమి3.09 గుంటలు 1968 లో విశ్వవిద్యాలయ నిర్మాణం కొరకు ప్రభుత్వం ఖరీదు చేయగా,414 సర్వే నెంబర్లో 1.00 ఎకరం భూమిని ఖరీదు చేసినట్లు తెలిపారు.412 సర్వే నెంబర్లో 0.36 గుంటల భూమిని విశ్వవిద్యాలయం నిర్మాణం కొరకు కరీదు చేసి తీసుకున్నారు. అట్టి భూములకు 1968 లోనే బై ఫర్కేషన్స్ ఏర్పడి 413/1 లో3.07 ఎకరాల భూమి పీజీ సెంటర్ పేరుమీద నమోదు చేయబడగా ఎస్సారెస్పీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ ఆక్విజేషన్ ఫైల్ నెంబర్ బి/31/979 ఫైలు ఆధారంగా413/2 లో 0.02 గుంటల భూమిని ఎస్సారెస్పీ ప్రధాన కెనాల్ నిర్మాణం కొరకు విశ్వవిద్యాలయానికి డబ్బులు చెల్లించి తీసుకున్నారని తెలిపారు.414/2లో 1.00 భూమిని పీజీ సెంటర్ నిర్మాణం కొరకు తీసుకోగా ప్రస్తుతం అట్టి భూమి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన రా వాటర్ పంప్ నిర్మాణం కొరకు తీసుకోబడినది రా వాటర్ పంప్ నిర్మాణం చేపట్టబడినదని తెలిపారు.414/3లో 0.29 గుంటల విస్తీర్ణం ఎస్సారెస్పీ ప్రధాన కెనాల్ నిర్మాణం కొరకు తీసుకోవడం జరిగిందని తెలిపారు.అదే రీతిగా 412/3లో 0.36 గుంటల భూమిని పీజీ సెంటర్ నిర్మాణం కొరకు తీసుకోవడం జరిగిందని తెలిపారు.412/2లో 0.21 విస్తీర్ణాన్ని ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ నిర్మాణం కొరకు తీసుకోవడం జరిగిందని తెలిపారు.పైన తెలుపబడిన వివరాలకు విలేజ్ మ్యాప్,పీపన్,సేత్వా రికార్డ్,కాస్రా పహణి రికార్డ్,సప్లమెంటరీ సేత్వార్,ఎస్సారెస్పీ పొడి మ్యాప్,ఆధారంగా కంబైన్డ్ లొకేషన్స్ స్కెచ్ సర్వే నివేదికతో ఇట్టి భూ వివరాలను రికార్డుల ద్వారా జిల్లా రెవెన్యూ యంత్రాంగం పకడ్బందీగా సర్వే నివేదికలతో కూడిన వివరాలను సిద్ధం చేసి పెట్టిందని గుర్తు చేశారు.ఇలా ఉండగా పై సర్వే నెంబర్లను కబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తులు నేరుగా 413 సర్వే నెంబర్ ను చూపిస్తూ 414 సర్వే నెంబర్ ను చూపిస్తూ పాత కొత్త నెంబర్లు అంటూ వాటికి సరితూగే ఫోర్జరీ పత్రాలు సృష్టించుకుని భూములు కబ్జాలు చేసి ఇండ్లు నిర్మించుకున్నారని తీవ్రంగా హెచ్చరించారు.సుమారు పదిసార్లు జిల్లా రెవెన్యూ కలెక్టర్ల ఆధ్వర్యంలో భూకొలతల యంత్రాంగం భూమిని కొలసి అట్టి కబ్జాలు చేపడుతున్న భూమి కేయూదేనని నిర్ధారించి పంచనామా లొకేషన్ స్కెచ్ సర్వే నివేదికల ఆధారాలను సుమారు 10 సార్లు కాకతీయ విశ్వవిద్యాలయ అధికారులకు ఇచ్చినప్పటికిని కబ్జాల పరంపర ఆగకపోవడం కేయూ అధికారులు కూడా భూకబ్జాదారులకు వత్తాసు పలుకుతూ అమ్ముడుపోతున్నారనే నిందలు చాలా సందర్భాల్లో వెలువడ్డాయని తెలిపారు.

**ఒకే ఒక్కడు.**

కాకతీయ బాలమిత్రుల పోలీస్ స్టేషన్లో సిఐగా విధులు నిర్వహించిన కే జనార్దన్ రెడ్డి ప్రస్తుతం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏసీపీగా పనిచేస్తూ గతంలో కేయూ భూముల కబ్జాలపై ఎన్నిసార్లు సర్వేలు జరిగినప్పటికిని భూకబ్జాలు నియంత్రించబడకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేయూ అధికారులు జిల్లా రెవెన్యూ అధికారులు కలిసి సంయుక్త కమిటీగా ఏర్పడి భూముల కొలతలకు,కేయూ భూముల కబ్జాలకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా చొరవ చూపటమే కాకుండా ఎన్నో అవమానాలు ఎన్నో ఒత్తిళ్లు ఎన్నో బూతు మాటలు పడుతూ దగ్గరుండి ఫిజికల్ అండ్ టెక్నికల్ సర్వే నివేదికను తెప్పించి కేయూ భూములను కాపాడిన రక్షణ ప్రధాతగా నిలిచిపోయారని గుర్తు చేశారు.డీజీపీఎస్ సర్వే నివేదికను తప్పించడంలో ఏసీబీ జనార్దన్ రెడ్డి కనపరిచిన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన చొరువను విద్యార్థి సమాజమే కాకుండా పాత్రికేయ సమాజమే కాకుండా పోలీసు వర్గాలు కూడా బిత్తరపోయే విధంగా ప్రభుత్వాన్ని కేయూ భూముల కబ్జాలపై చర్యలు తీసుకునే విధంగా ఉన్నాయని గుర్తు చేస్తూ,జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి కాకతీయ విశ్వవిద్యాలయానికి ఆర్ సి నెంబర్ ఏ/669/2021 తేది 29/01/2022 నాడు విశ్వవిద్యాలయ వీసీ రిజిస్ట్రార్ కు సర్వే నివేదికను ఇప్పించారని తెలిపారు.ఇట్టి కంబైండ్ లొకేషన్ స్కెచ్ ఆధారంగా పలువెల్పుల, లస్కర్సింగారం, కుమార్ పెళ్లి శివారులో గల కాకతీయ విశ్వవిద్యాలయ భూములకు సంబంధించిన పూర్తి సర్వే నివేదిక ఆధారాలను సిద్ధపరిచి కేయూ భూములకు శాశ్వత రక్షణ కల్పించిన తీరు సర్వే నివేదికలను సర్వే కొలతలను వీడియోలు తీయించి ప్రత్యేక పరిష్కార మార్గాలను చూపించారని తెలిపారు.ఇందులో కేయూ భూములను రక్షించడానికి పోలీస్ అధికారిగా తన వంతు బాధ్యతను నిర్వహించిన ఏసీపి కే.జనార్దన్ రెడ్డి.కేయూ భూముల కబ్జాలకు డీజీపీఎస్ సర్వే నివేదిక ఆధారంగా పర్ఫెక్ట్ పరిష్కార మార్గాన్ని చూపించారన్నది అభినందనలతో కూడిన వాస్తవమన్నారు.

**పోలీస్ అధికారుల కబ్జా పరంపర.**

కేయూ అధికారులు తెలుపుతున్న వివరాల ప్రకారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ నిఘా విభాగంలో 2 లో పనిచేస్తున్న ఏసిపి జానీ నర్సింహులు,హన్మకొండ ఆర్టీవో కార్యాలయంలో పనిచేస్తున్న కంచ వేణు 414 సర్వే నెంబర్లలో భూమి కలదంటూ కేయూ భూమిని కబ్జా చేస్తుండగా కేయూ అధికారులను భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా కబ్జా పనులను ఆటంక పరుస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని కేయూ అధికారులను దూషిస్తున్నారని తెలుపుతున్నారు.2013 వరకు 414 అను సర్వేనెంబర్ సుమారు మూడుసార్లు బై ఫర్ కేషన్ చేయబడగా నేరుగా 414 సర్వే నెంబర్ అంటూ పత్రాలు ఏర్పాటుచేసుకుని కేయూ భూమిని కబ్జా చేస్తుండడం కాకతీయ విశ్వవిద్యాలయ అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు.భూకబ్జాకు పాల్పడుతున్న వ్యక్తి పోలీస్ అధికారి కావడంతో ప్రభుత్వ స్థాయి నాయకులకు కూడా ఏం చేయలేకపోతుండడం సిగ్గుచేటుగా ఉందన్నారు.స్వయంగా విద్యాశాఖ మంత్రిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉంటున్నప్పుడు రాష్ట్ర డిజిపికి,రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ,జిల్లా కలెక్టర్ కు,పోలీస్ కమిషనర్ కు,పూర్తి ఆధారాలతో కూడిన లేఖలను విశ్వవిద్యాలయ అధికారులు పంపించినప్పటికీ కేయూ భూములకు చెందిన నడి సెంటర్లో అందాజా 900 గజాల భూమిని కబ్జా చేస్తూ,బోర్లు వేస్తూ,ప్రహరీ గోడ నిర్మించుకొని,షెడ్డు నిర్మించుకొని,కేయూ అధికారులనే కాదు జిల్లా పోలీస్ యంత్రాంగానే కాదు ఏకంగా ప్రభుత్వాన్ని బోల్తా కొట్టిస్తున్న తీరు కేయూ అధికారులు తట్టుకోలేకపోతున్నారని తెలిపారు.ఇట్టి భూమిపై ఇప్పటివరకు విజిలెన్స్ అధికారులు కేయూ అధికారులతో కలిపి సమైక్య విచారణ చేపట్టి నివేదికను సిద్ధపరిచారు, వరంగల్ టాస్క్ ఫోర్స్ అధికారులు పలుమార్లు మౌఖిక మోకాను విచారించి నివేదికను సిద్ధం చేశారు, ఇంటెలిజెన్స్ అధికారులు నిఘా విభాగ అధికారులు పలుమార్లు నివేదికలను సిద్ధపరచడమే కాకుండా పై అధికారులకు తెలియజేస్తూ ప్రభుత్వానికి నివేదికను పంపినారన్న సమాచారాలను ఏ ఒక్కరూ గుర్తించకపోవడం కబ్జాలను పెంచి పోషిస్తున్నట్లుగా ఉందన్నారు .ఉన్నపాటుగా జరుగుతున్న కేయూ భూముల కబ్జాపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి కబ్జాదారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని విశ్వవిద్యాలయ సమాజం విద్యార్థి లోకం పాత్రికేయ సమాజం విజ్ఞప్తి చేస్తుందని తెలిపారు.



# మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు

తమ పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు నెల రోజుల పాటు వాడవాడలా జెండా పండుగలు నిర్వహించనున్నట్లు కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ప్రకటించింది. ఈ మేరకు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా మే 20 నుండి జూన్ 20 వరకు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి వరకు పెద్ద ఎత్తున టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహిస్తామని తెలిపింది.పార్టీ ఆవిర్భావ సభలో తెలిపిన పార్టీ విధానాలను, పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వివరిస్తారని వెల్లడించింది. నేడు తెలంగాణ ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎక్కడికక్కడ గళమెత్తవలసిందిగా పార్టీ నాయకులను కార్యకర్తలకు ఇప్పటికే సూచించినట్లు తెలిపింది. అందులో భాగంగా రాష్ట్రస్థాయి అంశాలతో పాటు స్థానిక సమస్యల పట్ల కూడా అక్కడి శ్రేణులు స్పందించడం, అవసరమైనచోట పోరాటానికి సిద్ధంగా ఉంటారని తెలిపింది. టీఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా కార్యకర్తలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరువ కావాలని పిలుపునిచ్చింది. కలిసి వచ్చే వారిలో సమాజం పట్ల బాధ్యత, అంకితభావం కలిగిన చురుకైన కార్యకర్తలతో సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపింది. రాజకీయ చైతన్యం నిండిన ఒక బలమైన జన సమూహాన్ని ప్రజా ఉద్యమాల కోసం నిర్మిద్దామని పిలుపునిచ్చింది.

# దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌పై అవినీతి, భూఆక్రమణ ఆరోపణలు

**ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లకు ఫిర్యాదు**
**మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానం భూములపై విచారణకు ఆదేశాలు**

**వరంగల్, 11 మే 2026(జై భీమ్ న్యూస్)**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదాయ, ధర్మాదాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత పై అవినీతి, అధికార దుర్వినియోగం, దేవాలయ భూముల ఆక్రమణలకు సంబంధించిన తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ మేరకు వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లకు పలువురు హిందూ సంఘాల నాయకులు, దేవాలయ పరిరక్షణ సమితి ప్రతినిధులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, అసిస్టెంట్ కమిషనర్ కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆమె మామ కుమ్మరి సారయ్య పేరుపై ఉన్న మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన సుమారు ఎకరం 1.33 గుంటల భూమి ఆక్రమణకు గురైనట్లు ఆరోపించారు. దేవాలయానికి చెందిన ఆస్తులను వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని, అధికార హోదాను ఉపయోగించి రికార్డుల్లో మార్పులు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదుదారులు ఆరోపించారు. ఈ వ్యవహారం తీవ్రతరమవడంతో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ స్పందించి సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ క్రమంలో కాజీపేట ఎమ్మార్వో రాజుకు విచారణ బాధ్యతలు అప్పగించి పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు తెలిసింది. అలాగే ఆరోపణలు నిజమని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కూడా సూచించినట్లు సమాచారం. ఇక వరంగల్ జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన ఫిర్యాదులో కూడా ప్రభుత్వ స్థాయిలో నిష్పక్షపాత విచారణ జరిపించాలని కోరారు. దేవాలయ భూముల రక్షణలో




అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజల విశ్వాసానికి కేంద్రబిందువైన ఆలయ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన హిందూ సంఘాల నాయకులు, దేవాలయ భూములపై జరుగుతున్న ఆక్రమణలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఆలయ భూముల రికార్డులను డిజిటలైజ్ చేసి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ హిందూ పరిషత్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మండల భూపాల్, దేవాలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చీకటి రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పల్లపు అశోక్ తదితరులు పాల్గొని దేవాలయ భూముల పరిరక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

# ఉత్తర్వుల ప్రకారం స్థలాల కేటాయింపులు చేయండి -- కర్ణాటక జనందోలన సంస్థ

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

కర్ణాటక జనందోలన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన నిరసన సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్.సి. సిద్దలింగప్ప విలేకరులతో మాట్లాడుతూ, బెంగుళూరు దక్షిణ తాలూకా ఉత్తరపల్లి హోబళి కెంబత్తల్లి గ్రామ సర్వే నం.55లో ప్రభుత్వం నుండి మంజూరు చేయబడిన 8 ఎకరాల 10 గుంటల భూమిలో హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం పేదవారికి స్థలాలు కేటాయించబడ్డాయి. “సంఘటన సభ్యుల జాబితా సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ ఆమోదం పొంది 240 మంది సభ్యులకు చట్టబద్ధంగా కేటాయించబడింది. అనేకమంది ఇంటిని నిర్మించుకొని నివసిస్తున్నారు. కానీ కొందరు సంఘాల పేరు చెప్పుకొని నివాసం ఇవ్వండి అని అనవసరమైన ఆరోపణలు మరియు అపప్రచార నిర్వహిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదులు అందజేసే అవకాశం కల్పించే పని చేస్తున్నారు,” అని ఆరోపించారు. “హైకోర్ట్ ఆర్డర్‌తో తుది జాబితాలో ఉన్నవారికి మాత్రమే నివాసం ఉంది. వేరే వారికి ఇవ్వడం చట్టబాహిరమైనది.అలా కాదు ప్రచారం చేయడం ఆపి, న్యాయంగా పోరాటం నిర్వహించాలి,” అని అన్నారు. “పేదవారికి ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వమే భూమి అందించింది, ఇప్పుడు ప్రభుత్వ రోడ్డు, తాగునీరు సహా అందించాలి. ప్రాథమిక మరియు విద్యుత్ సౌకర్యాలను ప్రయోజనాల కోసం హక్కుపత్రం జరిగింది,” అని ప్రభుత్వాన్ని కోరారు. కెఇఎస్ సంస్థాపక అధ్యక్షుడు కన్నాల్లి కృష్ణప్ప మరియు వారి సభ్యులతో జరిగిన సమావేశంలో ప్రాథమిక సౌకర్యాన్ని కల్పించేలా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. “వివిధ సంస్థలకు సంబంధించి అపప్రచార చేయడానికి బదులుగా పేదవారికి కోసం పని చేయాలి. ప్రజలలో






గందరగోళం సృష్టించకూడదు. నియమానుసారంగా హైకోర్టు ఉత్తర్వులు మరియు ఇంటి కేటాయింపు అని సంస్థయ చేస్తోంది.” అని స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి – రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశం






**వరంగల్, 11 మే 2026(జై భీమ్ న్యూస్)**

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా తాజా ఓటరు జాబితాను ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి వరంగల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రానున్న 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను సమన్వయం చేసుకుంటూ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో కలగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మ్యాపింగ్ పురోగతిని మెరుగుపర్చేందుకు రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని, అలాగే స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మ్యాపింగ్ శాతాన్ని రాబోయే 15 రోజుల్లో గణనీయంగా పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) వై.వి. గణేష్, వరంగల్ ఆర్డీవో సుమ, ఖిలా వరంగల్ తహశీల్దార్ శ్రీకాంత్, వర్ధన్నపేట తహశీల్దార్ విజయ్ సాగర్, ఎలక్షన్ సూపరింటెండెంట్ రంజిత్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కాలనీ ప్రజలకు శుభవార్త --త్వరలో ఇంటింటికి మిషన్ భగీరథ త్రాగునీరు

**రాయపర్తి(జై భీమ్ న్యూస్)**



రాయపర్తి మండలంలోని జర్నలిస్ట్ కాలనీ ప్రజల ఎన్నాళ్లనో ఎదురుచూస్తున్న త్రాగునీటి సమస్యకు త్వరలో పూర్తి స్థాయిలో పరిష్కారం లభించనుంది. ఇంటింటికి మిషన్ భగీరథ జలాల సరఫరా కోసం మిషన్ భగీరథ (గ్రిడ్) డిఈ స్వామిదాస్,ఏఈ రవళి,సూపర్వైజర్ జక్కుల రాజు,గ్రామ సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు.కాలనీలో జరుగుతున్న పైప్‌లైన్ మరియు కనెక్షన్ పనులను స్వయంగా పరిశీలించిన అధికారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన డిఈ స్వామిదాస్ మరో నాలుగు నుండి ఐదు రోజుల్లోపు ఇంటింటికి స్వచ్ఛమైన మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరా అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.జర్నలిస్ట్ కాలనీ ప్రజలకు నాణ్యమైన త్రాగునీరు అందించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం చేపడుతున్న మిషన్ భగీరథ పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఆశాజ్యోతి అవుతుందని ప్రజలు అభిప్రాయపడ్డారు.




**పరారీలో బండి సంజయ్ కొడుకు బండి భగీరథ్ మూడు రోజులుగా ఫోన్ స్విచ్ ఆఫ్ నిందితుడు పరారీలో ఉన్నాడు, అతని జణ= పరిశీలిస్తుస్తున్నాం, ఆచూకీ కోసం గాలిస్తున్నాము బాధితురాలి స్టేట్మెంట్ రికార్డ్ చేసాము, మరిన్ని వివరాల కోసం ఇంకోసారి స్టేట్మెంట్ రికార్డ్ చేయాల్సి వస్తుంది -- బండి సంజయ్ కొడుకు ్రూజూూ కేసు విచారణాధికారి రితిరాజ్.**

## మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**



మండల కేంద్రానికి చెందిన మాజీ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ (పీఎస్ఓ ) గడ్డం శ్రీనివాస్ తల్లి గడ్డం భాగ్యమ్మ,మాజీ సర్పంచ్ పల్లకొండ సురేష్ తండ్రి సమ్మయ్య,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటయ్య,బొమ్మినేని సమ్మిరెడ్డి ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సోమవారం మృతుల కుటుంబాలను పరామర్శించారు.అయన వెంట మండల కన్వీనర్ తంపుల మోహన్,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు గడ్డం రఘువంశీ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ తక్కళ్లపెల్లి చందర్ రావు, సర్పంచులు అశోక్ రావు, వాణి రవికుమార్, అడ్డగూడి సతీష్, మునిగాల సమ్మయ్య, చింత అశోక్,దుపెల్లి రాజు, కొత్తూరి జాన్సన్,చింత రఘు, రాములు తదితరులు పాల్గొన్నారు

## దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

**రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**

**వరంగల్, 11 మే 2026(జై భీమ్ న్యూస్)**

రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో శివనగర్‌లోని పల్లవి హాస్పిటల్లో దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ అధ్యక్షులు మడూరు గణేష్, కార్యదర్శి పొన్న హరినాథ్, కోశాధికారి బండారు కుమారస్వామి, సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం క్లబ్ 48వ సేవా కార్యక్రమాల్లో భాగంగా జరిగింది. దాతలు పాలారపు కృష్ణమూర్తి, రావికంటి అశోక్, ఇరుకుల్ల నాగేశ్వరరావు సహకారంతో దివ్యాంగులు బానోతు రవి, శ్రీనివాస్, రాజులకు సుమారు రూ.50 వేల విలువైన ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇటీవల వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన చకిలం ఉపేందర్ను, అలాగే రామ్‌కీ విల్లా ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన బేతి అశోక్ బాబును రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చకిలం ఉపేందర్ మాట్లాడుతూ, ప్రజలకు కష్టసుఖాల్లో న్యాయపరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలూరి కృష్ణమూర్తి, చిన్నాల సత్యనారాయణ, పోరండ్ల రత్నాకర్, సదానందం, శ్రీరామ్, రవీందర్ ప్రసాద్, కిరణ్ కుమార్, మొగిలి చంద్రమౌళి, సురేష్ తదితర రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన రోటరీ క్లబ్ సభ్యులకు లబ్ధిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# విద్యా వరోత్సవాల్లో ఆకట్టుకోనున్న కాకతీయ విశ్వవిద్యాలయ వినూత్న ప్రదర్శనలు

**హన్మకొండ, 11 మే 2026 (జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించనున్న విద్యా వరోత్సవాల్లో పాల్గొనేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని విద్యా కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, సెరికల్చర్ విభాగాలకు చెందిన విద్యార్థులు మరియు సిబ్బందితో కూడిన బస్సును విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రాంచంద్రం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా వరోత్సవాల్లో కాకతీయ విశ్వవిద్యాలయం ప్రదర్శన స్టాల్‌ను ప్రభావవంతంగా, ఆకర్షణీయంగా నిర్వహించి విశ్వవిద్యాలయ ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇది ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, వారం రోజుల పాటు జరిగే విద్యా వరోత్సవాల్లో కాకతీయ విశ్వవిద్యాలయం భారీ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించనుందని తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు సమిష్టిగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్. రమణ, విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాసులు పాల్గొన్నారు. ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీ రాజు వల్లాల ఈ బృందానికి సారథ్యం వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఇక ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు రూపొందించిన పలు వినూత్న నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాస్కల్ సూత్రం ఆధారంగా రూపొందించిన హైడ్రాలిక్ బ్రిడ్జ్ నమూనా, భ్రూణ వికాస దశలను ప్రతిబింబించే మోడల్, "సర్కిల్ అండ్ ఇట్స్ పార్ట్స్"




పేరుతో రూపొందించిన ఎల్ఈడీ మోడల్, ఆధునిక 3డీ ప్రింటర్ ప్రదర్శన, పట్టుపరిశ్రమ ఆధారిత హస్తకళా ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకునేలా సిద్ధం చేశారు. ఈ ప్రదర్శనలు విద్య, విజ్ఞానం, సాంకేతికత, స్వయం ఉపాధి అవకాశాలను సమన్వయం చేస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా మహిళా సాధికారత, గ్రామీణ ఉపాధి అవకాశాలపై సెరికల్చర్ విభాగం రూపొందించిన ప్రదర్శనలు విశేష ఆదరణ పొందనున్నాయని పేర్కొన్నారు.

## హసన్‌పర్తి ఎస్‌హెచ్‌వోగా ఎ. మహేందర్ బాధ్యతల స్వీకారం

**గతంలో పలు కీలక ప్రాంతాల్లో సేవలు**
**శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని హామీ**

**హన్మకొండ జిల్లా/హసన్‌పర్తి, 11 మే 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)గా ఎ. మహేందర్ సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో సేవలందించిన మహేందర్ గతంలో పలు కీలక పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రజలకు చేరువగా ఉండే అధికారిగా, శాంతిభద్రతల పరిరక్షణలో కఠిన వైఖరితో పనిచేసే అధికారిగా ఆయనకు మంచి పేరు ఉందని పోలీస్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్‌గా నియమితులై బాధ్యతలు చేపట్టినట్లు వెల్లడించాయి. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మహేందర్ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. హసన్‌పర్తి పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలు ఎలాంటి సమస్యలైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే మహిళల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణ, యువతలో చైతన్యం కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో నేరరహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, వివిధ విభాగాల అధికారులు మహేందర్‌కు అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో హసన్‌పర్తి ప్రాంతంలో మరింత మెరుగైన పోలీసు సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కాకతీయ విశ్వవిద్యాలయంలో భారీ ఉద్యోగ మేళా - నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక చర్యలు

**హన్మకొండ, 11 మే 2026(జై భీమ్ న్యూస్)**




ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక అభివృద్ధి 99 రోజుల కార్యక్రమంలో భాగం గా కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యా ర్థులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు భారీ ఉద్యోగ మేళా నిర్వహించను న్నారు. ఈ ఉద్యోగ మేళా పోస్టర్‌ను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డా. చిర్ర రాజు గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు విశ్వవిద్యాలయం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో ప్రముఖ ప్రైవేట్ సంస్థలతో పాటు ఎలక్ట్రానిక్స్, ఫైనాన్స్, కార్పొరేట్ రంగాలకు చెందిన సుమారు 12 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని కామర్స్ సెమినార్ హాల్‌లో ఈ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు పలు రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య నరసింహ చారి, డీన్ ఆచార్య ఇస్తారు, వైస్ ప్రిన్సిపల్ డా. మమత, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ జిల్లాలో 9 పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపుల ప్రారంభం

**కమలాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన డీఈవో గిరిరాజ్ గౌడ్**

**హన్మకొండ, 11 మే 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజాపాలన--ప్రగతి ప్రజల కార్యక్రమంలో భాగంగా 99 రోజుల పాఠశాల పటిష్టీకరణ కార్యక్రమాలను హనుమకొండ జిల్లాలో సోమవారం ఘనంగా ప్రారంభించారు. మే 11 నుంచి మే 17 వరకు ఏడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని 9 పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ పాఠశాలల్లో ప్రత్యేక సమ్మర్ క్యాంపులను ప్రారంభించారు. హనుమకొండ గవర్నమెంట్ ప్రాక్టీసింగ్ హైస్కూల్, హసన్‌పర్తి జెడ్పీహెచ్ఎస్ (జీ), పరకాల జెడ్పీహెచ్ఎస్ (జీ), ధర్మసాగర్ జెడ్పీహెచ్ఎస్ (జీ), ఒంటిమామిడిపల్లి జెడ్పీహెచ్ఎస్, కమలాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్, ఎల్కతుర్తి తెలంగాణ మోడల్ స్కూల్, గట్లనర్సింగాపూర్ జెడ్పీహెచ్ఎస్, మడికొండ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ హసన్‌పర్తి జెడ్పీహెచ్ఎస్ (జీ), కేజీబీవీ హసన్‌పర్తి, తెలంగాణ మోడల్ స్కూల్ కమలాపూర్ కేంద్రాలను సందర్శించి సమ్మర్ క్యాంపులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమలాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని పాఠ్యాంశాలతో పాటు ఆటలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతి రోజు ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం కమలాపూర్‌లోని ఈజీఎస్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా విద్యాశాఖాధికారి అక్కడ నిర్వహిస్తున్న చెస్ పోటీలను వీక్షించి విద్యార్థులను అభినందించారు. కేంద్రంలోని నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ డా. బి. మహేష్, బి. మన్నేహాస్, ఎన్. సునీత, జె. సుమాధవి, టీజీఎంఎస్ ప్రిన్సిపాల్ డా. జె. అనిల్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ డి. స్వప్న, ఇంచార్జ్ ఎంఈవో శ్రీధర్, కమలాపూర్, గూడూరు సర్పంచ్ బండి వనజ కళాధర్ తదితరులు పాల్గొన్నారు.




## మైనర్ బాలిక కేసులో నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలి

**కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న దాస్యం వినయ్ భాస్కర్**

**హన్మకొండ, 11 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని బాలసముద్రం ప్రాంతంలోని భారత్ రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. మైనర్ బాలికపై అత్యాచారం జరిగి తీవ్ర అన్యాయం జరిగినప్పటికీ, ఇప్పటివరకు ప్రధాన నిందితుడిని అరెస్టు చేయకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. మొదట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినప్పటికీ, అనంతరం సెక్షన్లు మార్చి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. బాధ్యత గల ప్రతిపక్ష పార్టీగా నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో హోంమంత్రిగా ఉన్న సమయంలో ఎవరైనా నేరానికి పాల్పడితే, ముఖ్యంగా సెలబ్రిటీలు సంబంధం ఉన్న కేసుల్లో వారినే ప్రధాన నిందితులుగా చేర్చి శిక్షిస్తామని చెప్పారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం అదే ముఖ్యమంత్రి ఈ కేసులో భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతుల సమస్యలపై సదస్సు నిర్వహించిన సందర్భంలో పార్టీ జెండాలు తొలగిస్తున్నారని



కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన పార్టీ నాయకులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారని అన్నారు. కానీ రెండేళ్లుగా వేధింపులకు గురవుతున్న బాధితురాలు తల్లిదండ్రులతో కలిసి ఫిర్యాదు చేసినా, పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ కూడా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బీజేపీ నాయకులను కాపాడే ప్రయత్నం చేస్తోందని దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. బీజేపీ నాయకుల అరాచకాలకు కవచంలా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లి దశలవారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## నాణ్యమైన విద్యను అందిస్తున్న పింగిళి డిగ్రీ కళాశాల

**విద్యార్థినులు చేరి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలి : కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**హన్మకొండ, 11 మే 2026(జై భీమ్ న్యూస్)**

పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఉన్నత స్థాయికి తీసుకెళ్తోందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ బ్రోచర్‌ను కలెక్టర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పింగిళి కళాశాలలో సైన్స్, ఆర్ట్స్, కామర్స్ తదితర విభాగాల్లో అత్యాధునిక బోధన అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కళాశాలలో చేరి తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో విద్యా వారోత్సవాల ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా కళాశాల ఇంగ్లీష్ విభాగం మరియు కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఇలాంటి ఎంఓయూలు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సెమినార్లు, విస్తృత ఉపన్యాసాలు, విద్యా--విజ్ఞాన కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో



ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పింగిళి కళాశాల ఇంగ్లీష్ విభాగాధిపతి పి.డి. సుజాత, కేజీసీ ఇంగ్లీష్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనాథ్, డా. టి.ఎస్. ప్రవీణ్ కుమార్, డా. పి. దినకర్, వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సురేష్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం. అరుణ, విద్యా వారోత్సవాల సమన్వయకర్త డా. డి. రామకృష్ణా రెడ్డి తదితర అధ్యాపకులు, విభాగాధిపతులు, బోధన--బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్నేహ సమ్మర్ క్యాంపులను విజయవంతంగా నిర్వహించాలి : కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హన్మకొండ, 11 మే 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో 15 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికల కోసం నిర్వహిస్తున్న "స్నేహ సమ్మర్ క్యాంప్"లను సమర్థవంతంగా నిర్వహించి బాలికల్లో ఆత్మవిశ్వాసం, ఆరోగ్య అవగాహన, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో స్నేహ సమ్మర్ క్యాంపుల నిర్వహణపై డీఆర్డీవో మేన శ్రీను, డీడబ్ల్యూవో విశ్వజ, డీఈవో గిరిరాజ్ గౌడ్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, డీపీవో లక్ష్మీ రమాకాంత్ తదితర అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌమార దశలో బాలికల్లో చోటుచేసుకునే శారీరక, మానసిక మార్పులపై అవగాహన కల్పించాలని సూచించారు. గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ అంశాలపై బాలికలకు స్పష్టమైన అవగాహన కలిగించాలన్నారు. ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, పోషకాహారం ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా తెలియజేయాలని ఆదేశించారు. చదువుతున్న బాలికలు తమ ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా భవిష్యత్తులో ఏ రంగాన్ని ఎంచుకోవాలో ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. బాలికల్లో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందేలా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బాలికలను క్రీడల వైపు ప్రోత్సహించాలని, ప్రతి గ్రామపంచాయతీలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రక్తహీనతతో బాధపడుతున్న బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సేవలు అందించేలా చూడాలని సూచించారు. స్నేహ సమ్మర్ క్యాంపులు బాలికల సమగ్ర అభివృద్ధికి దోహదపడే విధంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పోలీస్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్, డీపీఎం పద్మప్రియ, ఏపీఎం శ్రీలత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుజాతతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పోక్సో బాధితురాలిని బెదిరించిన బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలి : ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

హన్మకొండ, 11 మే 2026 (జై భీమ్ న్యూస్)

పోక్సో కేసు బాధితురాలిపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ ప్రవర్తించిన తీరు అత్యంత అమానవీయమని హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హనుమకొండలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, న్యాయం కోసం తన వద్దకు వచ్చిన 7 ఏళ్ల మైనర్ బాలికను ఓదార్చాల్సింది పోయి ఆమె వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడటం బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధికి తగదన్నారు. నీ బిడ్డ ఎంతమందితో తిరిగిందో నాకు తెలియదు అంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు ఆయన వికృత మనస్తత్వానికి నిదర్శనమని విమర్శించారు. బాధితులకు అండగా ఉండాల్సిన నాయకులే నిందితులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా నాతో పెట్టుకుంటే మీకు ఏం జరిగినా నా బాధ్యత కాదు అంటూ బాధితులను భయపెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వెంకట్రామ్ రెడ్డి పేర్కొన్నారు. బాధితులను బెదిరించే ధోరణిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గత మూడు సంవత్సరాలుగా బీజేపీ అధికార ప్రతినిధిగా ఉన్న మాజీ జర్నలిస్ట్ సంగప్ప ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా వ్యవహరించారని ఆరోపించారు. ఏప్రిల్ 22 నుంచి 26వ తేదీల మధ్య బాధితులను బండి సంజయ్ నివాసానికి తీసుకెళ్లడం వెనుక ఉన్న కుట్రను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. బాధితురాలు వీడియోలు, చాటింగ్ ఆధారాలను చూపించినప్పటికీ వాటిని పట్టించుకోకుండా బాధితులనే నిందితులుగా చిత్రీకరించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన పలు డిమాండ్లు చేశారు. జూబ్లీహిల్స్‌లోని బండి సంజయ్ నివాసం వద్ద ఉన్న సీసీటీవీ ఫుటేజీని హైదరాబాద్ సీపీ వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. బండి సంజయ్, సంగప్ప, బాధిత కుటుంబ సభ్యుల ఫోన్ కాల్ డేటాను విశ్లేషించి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పోక్సో బాధితురాలిని భయపెట్టినందుకు, అసభ్యంగా మాట్లాడినందుకు బండి సంజయ్‌పై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. బేటీ బచావో అని నినాదాలు చేసే బీజేపీ నాయకులు తమ సొంత ఇంట్లోనే ఆడపిల్లలను



అవమానిస్తున్నారని, బాధితులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి స్పష్టం చేశారు.

# జయగిరి గ్రామంలో చెరువు పూడికతీత పనుల పరిశీలన





హసన్ పర్తి, 11 మే 2026 (జై భీమ్ న్యూస్)

సమాంతర సామాజిక తనిఖీలో భాగంగా జయగిరి గ్రామంలోని పాత చెరువు పూడికతీత పనులను బ్లాక్ రిసోర్స్ పర్సన్ చిరంజీవి సోమవారం పరిశీలించారు. చేపడుతున్న పనుల పురోగతి, కూలీల హాజరు, పనుల నాణ్యతపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలు కొలతల ప్రకారం పనులు నిర్వహించాలని సూచించారు. పనుల్లో పారదర్శకత పాటిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు కొనసాగించాలని తెలిపారు. అనంతరం కూలీల మాస్టర్లను పరిశీలించి సంబంధిత వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీధర్, మేట్స్ హరీష్, కూలీలు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ భర్త

### రూ.10 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత

కొమురవెల్లి, 11 మే 2026 (జై భీమ్ న్యూస్)

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపు దాడి నిర్వహించి పంచాయతీ కార్యదర్శి మరియు సర్పంచ్ భర్తను లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. కొమురవెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్లాట్‌లో గ్రామ పంచాయతీ వారు డ్రైనేజీ పైప్‌లైన్ వేశారు. ఆ పైప్‌లైన్‌ను తొలగించేందుకు సంబంధిత అధికారిక పనికి పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజు గౌడ్ రూ.10 వేల లంచం డిమాండ్ చేసినట్లు తెలిపారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు పక్కా ప్రణాళికతో నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం 4.40 గంటల సమయంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో లంచం డబ్బులు తీసుకుంటుండగా అధికారులు దాడి నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకు సర్పంచ్ గొల్లపల్లి పద్మ భర్త గొల్లపల్లి అంజనేయులు (ఏ-2) లంచం సొమ్ము స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకుని డబ్బును స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ ఘటనతో మండలంలో చర్చనీయాంశంగా మారింది.



# హసన్‌పర్తి మండలంలో ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

### మే 12న మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహణ

హసన్‌పర్తి, 11 మే 2026 (జై భీమ్ న్యూస్)

హసన్‌పర్తి మండలంలో ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన ఇంటర్వ్యూలు మే 12న మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ తప్పనిసరిగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారాలను రెండు సెట్లలో సిద్ధం చేసుకొని, సంబంధిత ధ్రువపత్రాలు, అవసరమైన సర్టిఫికెట్లతో రావాలని పేర్కొన్నారు. అర్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఇతర అవసరమైన పత్రాలను వెంట తీసుకురావాలని అధికారులు సూచించారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించబడుతుందని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో అర్హత ప్రమాణాలను పరిశీలించి ఇంటర్వ్యూల ద్వారా తుది ఎంపిక చేపట్టనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుదారులు నిర్ణీత సమయానికి హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.




# వరంగల్ జిల్లాలో 11 పీఎం శ్రీ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపుల ప్రారంభం

### ప్రభుత్వ ఉన్నత పాఠశాల నరేందర్ నగర్‌లో ప్రారంభించిన కలెక్టర్ డా. సత్య శారద




వరంగల్, 11 మే 2026 (జై భీమ్ న్యూస్)

వరంగల్ జిల్లాలోని 11 పీఎం శ్రీ పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ డా. సత్య శారద సోమవారం ఘనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నరేందర్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ఈ క్యాంపులు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. మే 11 నుంచి మే 25 వరకు మొత్తం 15 రోజుల పాటు ఈ సమ్మర్ క్యాంపులు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థుల సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాల పెంపొందనకు ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. సత్య శారద మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని క్రీడలు, కళలు, డిజిటల్ విద్య, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి బి. రంగయ్యనాయుడు మాట్లాడుతూ జిల్లాలోని 11 పీఎం శ్రీ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే విధంగా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ సుజన్ తేజ, డీబీసీడీఓ పుష్పలత, ఎంఈవో మరియు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ సమ్మర్ క్యాంపులు ఉపయోగపడతాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

# అంబాలలో జనగణన కార్యక్రమం ప్రారంభం

### ప్రజలు పూర్తి సహకారం అందించాలని అధికారుల విజ్ఞప్తి



కమలాపూర్, 11 మే 2026 (జై భీమ్ న్యూస్)

అంబాల గ్రామంలో జనగణన కార్యక్రమాన్ని సోమవారం అధికారికంగా ప్రారంభించారు. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా, కుటుంబ వివరాలను సమగ్రంగా సేకరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జనగణన ద్వారా గ్రామ ప్రజల జీవన పరిస్థితులు, విద్యా స్థాయి, ఉపాధి అవకాశాలు, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన సమాచారం ప్రభుత్వానికి అందుతుందని తెలిపారు. ఈ సమాచారం ఆధారంగా భవిష్యత్తులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. సిబ్బంది అడిగే వివరాలను నిజాయితీగా తెలియజేయాలని సూచించారు. సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ఎలాంటి అపోహలు లేదా భయాలు పెట్టుకోకుండా ప్రజలు సహకరించాలని తెలిపారు. గ్రామంలో జనగణన కార్యక్రమాన్ని అధికారులు ప్రత్యేక పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు ఆలేటి నర్సింహారెడ్డి, సంపత్, భారతి, సిబ్బంది, అంగన్వాడీ టీచర్ రజిత, జీపీఓ రాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించారు. జనగణన కార్యక్రమం విజయవంతం కావడానికి గ్రామ ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయ స్టాల్‌ను సందర్శించిన తెలుగు అకాడమీ చైర్మన్ ఆచార్య కె. వెంకటనారాయణ

హైద్రాబాద్, 11 మే 2026 (జై భీమ్ న్యూస్)

తెలుగు అకాడమీ చైర్మన్ ఆచార్య కె. వెంకటనారాయణ సోమవారం హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కాకతీయ విశ్వవిద్యాలయ స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టాల్‌లో ప్రదర్శించిన వివిధ విద్యా, పరిశోధనా అంశాలను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను వీక్షించిన ఆచార్య వెంకటనారాయణ, విద్యార్థులు, అధ్యాపకుల ప్రతిభను అభినందించారు. ముఖ్యంగా సిరికల్చర్ మరియు ఎడ్యుకేషన్ కళాశాలల ప్రదర్శనలు తనను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం విద్యా, పరిశోధన రంగాల్లో చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి విద్యా, పరిశోధనా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహం, భాగస్వామ్యం అందించేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

